యాసంగి జోరు..

- ముమ్మరంగా నాట్లు
- కూలీల కొరతతో రైతన్నల ఇబ్బందులు
- ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి


నారును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)


నాట్లు వేస్తున్న కూలీలు

నడికూడ : యాసంగి సాగులో రైతన్నలు బిజీబిజీగా గడుపుతున్నారు. కూలీల కొరత ఏర్పడడం వలన ఇతర మండలాల నుంచి కూలీలను తీసుకొచ్చి నాట్లు వేస్తున్నారు. మండల పరిధిలోని వివిధ చెరువులు, బావుల సమీపంలో, కాల్వల సమీపంలో సుమారు 6 వేల ఎకరాల్లో వరి సాగు అవుతోందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నడికూడ, పులిగిల్ల, వరికోల్, రాయపర్తి, చౌటుపర్తి తదితర గ్రామాల్లో నాట్లు జోరందుకున్నాయి. చెరువులు, కుంటల్లో నీరు అంతంత మాత్రంగానే ఉండడం, ఇప్పటి వరకు ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీరు విడుదల కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యమైతే వరినారు ముదిరిపోయే అవకాశం ఉందని వాపోతున్నారు.

ఆటో, ట్రైలీల్లో కూలీల తరలింపు

నాటు వేసేందుకు కూలీల కొరత ఏర్పడడంతో పరకాల, అంబాల, హసన్‌పర్తి, మల్లారెడ్డిపల్లి తదితర ప్రాంతాల నుంచి కూలీలను ఆటోలు, ట్రాలీల్లో తరలిస్తూ పనులు ముమ్మరం చేస్తున్నారు. మహిళ కూలీకి రూ.400 నుంచి 450, మగవారికి రూ.1,000 తో పాటు అదనంగా ఆటో చార్జీలను ఇస్తూ రైతులు పనులు వెళ్లదీస్తున్నారు. ఎకరం పొలం నాటు వేసేందుకు 10 నుంచి 15 మంది కూలీలు, రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు తీసుకుంటున్నట్లు రైతులు తెలిపారు. వ్యవసాయ అధికారులు వెదజల్లే పద్ధతితో వరిసాగు ఖర్చు తగ్గుతుందని, రైతులు దృష్టి సారించాలని అవగాహన కల్పిస్తుండడంతో కొంతమంది రైతులు వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు. అయితే చాలామంది రైతులు పాతపద్ధతిలోనే నాట్లు వేస్తున్నారు.

కూలీలకు పొంచిఉన్న ప్రమాదం

పొట్టకూటి కోసం కూలీకి వెళ్లే వారికి ప్రమాదం పొంచి ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. నలుగురు వెళ్లాల్సిన ఆటోలో 15 మంది వరకు ప్రయాణిస్తున్నారు. 4 వీలర్‌లో దాదాపు 30 మంది వరకు ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా జాగ్రత్తలు పాటించాలని పలువురు సూచిస్తున్నారు.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి



గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది మండలంలో వర్షాలు తక్కువగా పడ్డాయి. చాలా గ్రామాల్లో చెరువులు, కుంటల్లో నీటిమట్టం తగ్గింది. దీంతో చాలామంది రైతులు నాట్లు వేసేందుకు ఆలోచిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలి.

– దుప్పటి రమేశ్, రైతు, నడికూడ

పెట్టుబడి పెరిగింది



కూలీల కొరత ఏర్పడడంతో ఇతర గ్రామాల నుంచి కూలీలను తీసుకొస్తున్నాం. దాదాపు 20, 30 కిలోమీటర్ల దూరం నుంచి ఆటో, ట్రాలీల్లో తీసుకురావడంతో పెట్టుబడి పెరుగుతోంది. కూలీకి వచ్చే ఒక్కొక్కరికి రూ.400 చెల్లించాల్సి వస్తోంది. ఈ ఏడాది నీటి కష్టం కూడా ఎదురైంది.

– ఊర శ్రీనివాస్ రావు, రైతు, నడికూడ

క్లుప్తంగా

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్



కమలాపూర్ : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ శివారులో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి స్థానిక పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో పరకాలకు చెందిన లక్కం రాజేందర్, బోయిని రాజేష్, బొమ్మకంటి సుధీర్, అవనిగంటి హిమవంత్, శనిగరానికి చెందిన గట్ల మల్లేశం, బండి కుమారస్వామి, గూడూరుకు చెందిన ఆవునూరి రాజ్‌కుమార్ అనే ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.54,400 నగదుతో పాటు 52 పేక ముక్కలు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని ఏడుగురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కమలాపూర్ : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యం పెంపొందుతుందని ఎస్సై వీరభద్రరావు అన్నారు. మండలంలోని గూడూరులో గ్రామ యువత సహకారంతో కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడు కుమ్మరి ప్రశాంత్ ఆధ్వర్యంలో 'యువత మేలుకో మత్తు వదులుకో' అనే నినాదంతో నిర్వహించిన క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్యగౌడ్, మాజీ సర్పంచ్ అంకతి సాంబయ్య, నాయకులు పోడేటి భిక్షపతి, హనుమాన్ ప్రసాద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్ : మామునూర్ 11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని వరంగల్ డీఈ మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని మామునూర్, కుమారపల్లి, డెయిరీఫారం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

నియామకం

నయీంనగర్: క్రిస్టియన్ కౌన్సిల్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్‌గా డాక్టర్ అంబాల ప్రశాంత్ నియమితులయ్యారు. 30 డిసెంబర్ 2024న జరిగిన కౌన్సిల్ మీటింగ్‌లో సౌత్ ఇండియా ప్రెసిడెంట్, తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జ్‌గా ఎన్నుకున్నారు. అలాగే జాతీయ అధికార ప్రతినిధిగా కూడా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ క్రైస్తవ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు అండగా ఉంటానని, తన నియామకానికి సహకరించిన కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్



నడికూడ : తహసీల్దార్ నాగరాజు శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా పరకాల ఆర్డీఓ నారాయణతో కలిసి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ నాగరాజు స్వయంగా కలెక్టర్ ప్రావీణ్యపై రాసిన అక్షరాభిషేకం జ్ఞాపికను అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రస్మా ప్రతినిధులు

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదను శుక్రవారం వడుప్సా, ట్రస్మా కార్యవర్గ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు వారు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో వడుప్సా, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అంకటి వీరస్వామి, ట్రస్మా గౌరవ అధ్యక్షుడు అడెపు శ్యామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర్‌సింగ్, జిల్లా సలహాదారులు కోడెం శ్రీధర్, ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడు ముక్కెర రవీందర్, క్రాంతికుమార్ ఉన్నారు.

నిరవధిక సమ్మె విరమించేది లేదు


మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న హమాలీలు

పరకాల : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పరకాల సివిల్‌సప్లై గోదాం హమాలీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా హమాలీలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఎగుమతి, దిగుమతి రేట్ల ఒప్పందం ప్రకారం జీఓను విడుదల చేయాలని, అప్పటి వరకు గోదాం నుంచి సరుకులు ఎగుమతి, దిగుమతి చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అయితే సమ్మెకు సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. సివిల్‌సప్లై కార్మికులతో వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండి వైఖరి చూస్తుంటే హమాలీలను ఆర్థికంగా మరింత నిర్వీర్యపర్చేందుకు చూస్తుందని ఆరోపించారు. నాయకులు గడ్డం సురేష్, మచ్చ శంకర్, మచ్చ సందీప్, బొచ్చు కృష్ణ, బొచ్చు భిక్షపతి, జూపాక చంద్రమౌళి, కొమ్ముల మహేందర్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక


సాంబమూర్తి

కమలాపూర్ : ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నూక సాంబమూర్తి, ఉపాధ్యక్షుడిగా ఉడుతన బోయిన కిశోర్, కార్యదర్శిగా తోట రమేష్, కోశాధికారిగా గట్టు నారాయణగౌడ్, డైరెక్టర్లుగా తిరుపతి, సతీష్ ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించి ఎరువుల, పురుగుల మందుల దుకాణాదారులకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండలంలోని పలు గ్రామాల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ షాపు డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు ప్రధానోపాధ్యాయులు, పలు సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం ఆమె జయంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్


కమలాపూర్ : నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


ఎల్కతుర్తి : ముల్కనూరులో..


ఆత్మకూరులో..


ఐనవోలులో..

సంక్షిప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



ఐనవోలు : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన రాజారపు మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, మెట్టు గుట్ట ఆలయ చైర్మన్ రఘు చందర్, రాయపురం సాంబయ్య, సాయిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, భాస్కర్, సునీల్, సాంబయ్య, రహీం పాషా తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆత్మకూరు : పీఆర్టీయూ (టీఎస్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం హనుమకొండలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి, ఆత్మకూరు మండల అధ్యక్షుడు అబ్బు బుచ్చిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహరి, రాష్ట్ర నాయకులు ఉపేందర్‌రెడ్డి, భుజంగరావు, భగవాన్ రెడ్డి పాల్గొన్నారు.

ఏసీపీకి జ్ఞాపిక అందజేత



పరకాల : నూతన సంవత్సరం సందర్భంగా పరకాల ఏసీపీ సతీష్‌బాబుకు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం పరకాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాలెండర్ ఆవిష్కరణతో పాటు జ్ఞాపిక అందజేశారు. బ్రహ్మకుమారి పరకాల శాఖ నిర్వహకురాలు విజయలక్ష్మి, హనుమకొండ శాఖ నిర్వహకురాలు విమల, బ్రహ్మకుమారి సాంబమూర్తి, రవీందర్ పాల్గొన్నారు.

ఈజీఎస్ సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలి

- డీఆర్డీఓ మేన శ్రీను

ఆత్మకూరు : ఈజీఎస్ సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలని డీఆర్డీఓ మేన శ్రీను అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఈజీఎస్ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ సిబ్బంది ఈజీఎస్ పని తీరును వివరించారు. పలు గ్రామాల్లో రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నివేదికలో తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్‌ల నుంచి రూ.2 వేలు, ఇతర సిబ్బంది నుంచి రూ.2,500, కూలీల నుంచి రూ.11,939 మొత్తం రూ.16,439 రికవరీకి అధికారులు ఆదేశించారు. అనంతరం డీఆర్డీఓ మాట్లాడుతూ.. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పని కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి రాజేందర్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ అధికారులు పుష్పలత, నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీధర్, ఏపీఓ రాజిరెడ్డి, రమేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్డీఓ మేన శ్రీను

స్నేహితుడి కుటుంబానికి చేయూత

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన పోరండ్ల అన్వేష్ తల్లి పోరండ్ల చంద్రకళ పక్షవాతంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న 2007–2008 సంవత్సరంలో అన్వేష్‌తో కలిసి పదోతరగతి చదువుకున్న తోటి మిత్రులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ. 33,400 నగదును వైద్య ఖర్చుల నిమిత్తం అందించారు. తమతో చదువుకున్న తోటి స్నేహితులు ఆపదలో ఉంటే ఆదుకునేందుకు ఎల్లవేళల ముందుంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఎలాంటి ఆపద వచ్చిన సంప్రదించాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. జీవితంలో కష్టాలు సహజమని ధైర్యంగా ఉండాలని అన్వేష్‌కు మనోధైర్యం చెప్పారు. ఆర్థిక పరంగా ఇబ్బందులు ఎదురైతే తమను సంప్రదించాలని, ఆపద సమయంలో ఆదుకునే వారే నిజమైన స్నేహితులని అన్నారు. ఈ కార్యక్రమంలో మిత్రులు వేణు, శివశంకర్, క్రాంతికుమార్, రాకేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.


స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

కమలాపూర్ : పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులలపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ గుండె బాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు ఉదయాన్నే మల్టీపర్పస్ వర్కర్లతో రోడ్లన్నీ శుభ్రం చేయించాలని, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. డ్రెయినేజీల్లో మురుగునీరు నిల్వకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఏ వార్డులో, ఏ రకమైన పారిశుద్ధ్య పనులు నిర్వహించారనే విషయాన్ని తెలుపుతూ ఆ పనులకు సంబంధించిన ఫోటోలను ప్రతీ రోజు మండల పరిషత్ కార్యాలయానికి వాట్సాప్ ద్వారా పంపాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం గూడూరులో జరిగిన జీపీడీపీ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.


శ్మశానవాటిక వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు

భాషా నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలి


ధర్మసాగర్ : సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎంపీడీఓ


పరకాల : విద్యార్థులను అభినందిస్తున్న ఎల్టా బాధ్యులు


ఐనవోలు : బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

ధర్మసాగర్ : ఇంగ్లిష్ మాట్లాడటం, చదవడం, రాయడం, వినడంలో విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని ఎంపీడీఓ అనిల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ధర్మప్రకాశ్ అధ్యక్షతన శుక్రవారం ఇంగ్లిష్ ఒలంపియాడ్, వక్తృత్వ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఇంగ్లిష్ మాట్లాడడంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇంగ్లిష్ మాట్లాడే సామర్థ్యం కేవలం నైపుణ్యం కాదని విద్య, వృత్తి, వ్యక్తిగత వృద్ధిలో అనేక అవకాశాలు కల్పించడంలో కీలకమన్నారు. ఈ పోటీల్లో నారాయణగిరి పాఠశాల విద్యార్థిని సాత్విక, పెద్దపెండ్యాల పాఠశాల విద్యార్థి ఆర్యన్, సాయిపేట పాఠశాల విద్యార్థిని అక్షయ విజేతలుగా నిలువగా, వక్తృత్వ పోటీల్లో దేవునూర్ పాఠశాల విద్యార్థి రామ్‌చరణ్, సాయిపేట పాఠశాల విద్యార్థి అక్షయ, పెద్దపెండ్యాల పాఠశాల విద్యార్థి పాషా విజేతలుగా నిలిచినట్లు న్యాయనిర్ణేతలు రవీందర్, అరుణ, పద్మ, ప్రీతి తెలిపారు. అనంతరం విజేతలకు ఎంపీడీఓ సర్టిఫికెట్లు అందించారు.

పరకాల : ఎల్టా పోటీల్లో జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు ప్రధానోపాధ్యాయుడు చక్రవర్తుల మధు తెలిపారు. తెలంగాణ భారతి అనుబంధ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో శుక్రవారం పరకాల మండల స్థాయి ప్రతిభపాటవపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పరకాల జిల్లా పరిషత్ బాలికలు ఉన్నత పాటశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. తెలంగాణ ఇంగ్లిష్ ఒలింపియాడ్ స్ట్రీమ్–1 లో, ఎలోక్యూటేషన్ స్ట్రీమ్–1లో ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి ఎస్.సిరి (9వ తరగతి– జెడ్పీహెచ్‌ఎస్), ద్వితీయ బహుమతి వి.పావని (9వ తరగతి– జెడ్పీహెచ్‌ఎస్), తృతీయ బహుమతి అలేఖ్య (జెడ్పీహెచ్‌ఎస్–బాలుర) విజేతలుగా నిలిచారు. అదే విధంగా స్ట్రీమ్–2లో టీఎస్ మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులు పాల్గొనగా ప్రథమ బహుమతి ఎస్.పుష్పాంజలి (టీజీఎస్‌డబ్ల్యుఆర్‌ఎస్–పరకాల), ద్వితీయ బహుమతి బి.తరుణ (టీజీఎస్‌డబ్ల్యుఎఆర్‌ఎస్–ఆత్మకూరు) సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్లభాషా ఉపాధ్యాయుల సంఘం (ఎల్టా) ఆధ్వర్యంలో మండలస్థాయి ఇంగ్లిష్ ఒలంపియాడ్, ఎలక్యూషన్ (ఉపన్యాస) పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐనవోలు కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇలాంటి నైపుణ్య పోటీలు విద్యార్థుల ఆంగ్లభాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు దోహదపడుతాయన్నారు. రెండు విభాగాల్లో మండలస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. మండలస్థాయి ఎలక్యూషన్‌లో మొదటి బహుమతి శృతి (జెడ్పీహెచ్‌ఎస్, కొండపర్తి), రెండో, మూడో బహుమతి శ్రీజ, ఐశ్వర్య (జెడ్పీహెచ్‌ఎస్, పంథిని) విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా మండలస్థాయి ఇంగ్లిష్ ఒలంపియాడ్‌లో మొదటి బహుమతి ఐశ్వర్య (జెడ్పీహెచ్‌ఎస్, పంథిని), రెండో బహుమతి సందేశ్ (జెడ్పీహెచ్‌ఎస్, ఒంటిమామిడిపల్లి), మూడో బహుమతి శృతి (జెడ్పీహెచ్‌ఎస్, కొండపర్తి) విద్యార్థులు అందుకున్నారు. ఎల్టా కన్వీనర్ రాంపల్లి విజయ్‌భాస్కర్, కోకన్వీనర్ సూరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మిత్రులకు అండగా ఉంటాం

హసన్‌పర్తి : మిత్ర మండలి సొసైటీ సభ్యులకు అండగా ఉంటామని ఆ సంఘం అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ అన్నారు. సొసైటీ సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని సభ్యులకు 10 గ్రాముల బంగారు నాణేన్ని అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

సంగీతకు రూ.3 వేల ఆర్థికసాయం

కమలాపూర్ : జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన మౌటం సంగీతకు యూత్ కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్ రూ.3 వేల ఆర్థికసాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన సంగీత జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనప్పటికీ జార్ఖండ్‌కు వెళ్లొచ్చే స్థోమత లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుదనే విషయం తెలుసుకుని సాయం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

విద్యార్థులకు కలెక్టర్ అభినందన



వేలేరు : రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో 5వ స్థానంలో పీచర జెడ్పీహెచ్‌ఎస్ నిలిచింది. దీంతో విద్యార్థులు రాఘవి, అర్చన, అజయ్, ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, గైడ్ టీచర్ దయాకర్‌ను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం అభినందించారు. రానున్న రోజుల్లో ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రశంసపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వాసంతి, జేవీవీ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరావు, ఎస్‌ఐటీ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, రాములు, వేణు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.